# రాజీ

"రెండు చొక్కా గుడ్డలు కొనుక్కోండి" వంటగదిలో నుంచి హెచ్చరించింది అండాళ్లమ్మ.

"ఎలాగో పట్నం వెళ్తున్నారు గదా! ఓ జత చెప్పులు కూడా కొనుక్కోండి. బొత్తిగా బాగోలేవు మీ చెప్పులు"

పట్నం వెళ్ళటానికి తయారైన సుబ్బయ్య ఓనిముషం ఆగాడు. ఆ తరువాత అరిగిపోయిన చెప్పులలోనికి కాళ్ళు దూర్చి బయలుదేరాడు.

నిజమే, బొత్తిగా బాగోలేవు చెప్పులు! చెప్పులు తొడుక్కునా సగం పాదం నేలమీదే వుంది.

అవసరాలతో రాజీ పడటం అలవాటైపోయిన అతను అది పట్టించుకోలేదు.

గొడుగు విప్పిపట్టుకొని ముందుకు నడిచాడు.

కోపగ్రస్తుడైన వైశాఖ మాసపు సూర్యుడు భూమిమీద మండిపడుతున్నాడు. అతని కోపానికి అలవాటు పడిపోయిన మానవులు ఎండతో రాజీపడి రోడ్డుమీద తిరుగుతున్నారు.

"బాబూ తమరా" రోడ్డువారగా వచ్చిన ఒక రైతు సుబ్బయ్యకు దండం పెడుతూ అడిగాడు. "ఎందాకా బాబూ ప్రయాణం"

"పట్నం వెళ్తున్నానయ్యా" హుషారుగా అన్నాడు సుబ్బయ్య.

"కాశీకి వెళ్తున్నానుగా, టిక్కెట్టు తీసుకోవాలి"

"అట్లాగా బాబూ" రైతు అన్నాడు. "పొద్దెక్కి పోనాది ముందే బయలు దేరలేక పోయారా? ఎండ మండిపోతోంది"

నిజమే! ఎండ చాలా తీక్షణముగా వుండి. గొడుగు పట్టుకున్నా ఎండ తగులుతోంది. చిల్లులు పడి, రంగు వెలసిపోయిన ఆ గొడుగు అలంకారముగా పనికి వస్తుందేమో, కానీ అవసరానికి పనికి వచ్చేట్లుగా లేదు.

"పగలంతా ఎండలో తిరగాలి కదా, ఓ గొడుగు కొనుక్కోరాదా?" ఎన్నోసార్లు చెప్పింది ఆండాళ్ళమ్మ.

"గొడుగెందుకు" సుబ్బయ్య నవ్వుతూ అన్నాడు. "నీకు తెలియదులే, ఎండ తగలడం శరీరానికి చాలా మంచిది. విటమిన్ 'ఎ' పెరుగుతుందట".

ఆండాళ్ళమ్మ మాటని అలా నవ్వులాటగా తీసేసాడు గాని, ఎండలో తిరగడం కష్టముగానే అనిపించేది సుబ్బయ్యకు. కానీ గొడుగు కోసం డబ్బు ఖర్చు చెయ్యడం ఇష్టపడలేదు అతను. ఆ డబ్బుతో మరో అవసరము తీర్చుకో వచ్చు కదా, అనేది అతని ఆలోచన.

రోడ్డు చేరేటప్పటికి బాగా అలసిపోయాడు, సుబ్బయ్య, రోడ్డువారగా వున్న అప్పన్న 'టీ' దుకాణములో దూరి ఓ బెంచీలో కూలబడ్డాడు.

"సుబ్బయ్యగారికి ఓ 'టీ' పట్రండిరా" ఈ బెంచీ మీద కూర్చున్న ఒకతను అన్నాడు. "బాగా అలిసిపోయారు పాపం"

"గురువుగారు 'టీ' తాగరు" అప్పన్న అన్నాడు.

సుబ్బయ్య 'టీ' తాగడని అప్పన్నకు తెలుసు. 'టీ' యే కాదు 'కాఫీ' కూడా తాగరు. ఏమి తినాలన్నా, తాగాలన్నా ఇంటిలోనే. ఆ సంగతి నలుపది సంవత్సరాలుగా సుబ్బయ్యని బాగ ఎరిగి వున్న అప్పన్నకి తెలుసు. అప్పన్నకే కాదు ఆ వూరిలోని చాలా మందికి ఆ సంగతి తెలుసు. అది సుబ్బయ్య 'నిష్ట' అని కొందరనుకుంటే, అది అతని పిసినారితనమని మరి కొందరు అనుకొనేవారు. కానీ అది నిజానికి నిష్ట గాని, పిసినారి తనముగాని కాదు. జీవితము సాఫీగా గడిచిపోవటము గురించి అవసరాలతో రాజీ పడటము.

"తమరు కాశీకి వెళుతున్నారట గదా?" అప్పన్న అడిగేడు.

"కాశీకి వెళ్లటమే కాదు అప్పన్నా కాశీకి వెళ్ళి అక్కడే మిగిలిన రోజులు వెళ్ళబుచ్చాలని కూడ అనుకుంటున్నాను"

"అంటే...." 'టీ' కలుపుతున్న అప్పన్నకి ఆ మాటలు అర్ధము కాలేదు.

"కాశీకి వెళ్ళి అక్కడే వుండిపోతాను. మళ్ళీ మనవూరు రాను"

"అదేమిటి బాబు?" 'టీ' గ్లాసు పుచ్చుకొని అలాగే వుండిపోయాడు అప్పన్న. "ఈ ఊరిలో పుట్టి పెరిగారు కదా. ఊరు వదిలేస్తారా?"

"ఏంచెయ్యను అప్పన్నా" సుబ్బయ్య నిట్టూర్చాడు. "ఈ ఊరిలో నాకేమి ఉందని? ఇప్పటి వరకు జీవితములో ఏ కోరికా తీర్చుకోలేకపోయాను. చివరి రోజులు కాశీ విశ్వేశ్వరుని పాదాల దగ్గర గడపాలని నా కోరిక"

అప్పన వెళ్ళి పొయ్యి వెలిగించాడు. అగ్నికి ఆహుతికావడము జీవిత ధర్మమని తెలిసి రాజీ పడిపోయిన కట్టెలు నిరసన చూపక చకచకా మండాయి.

రోడ్డుమీదకు దృష్టి మళ్ళించాడు, సుబ్బయ్య బుజానికి, నడుముకి, రకరకాల సంచులు తగిలించుకున్న బడిపిల్లలు బారులు, బారులుగా రోడ్డుమీద వెళుతున్నారు. ఒంటిపూట బడికాబోలు ! వాళ్ళని చూస్తూ వుంటే ముచ్చట వేసింది సుబ్బయ్యకి. కానీ వెంటనే తను జీవితములో మొదటిసారిగా కోరికతో రాజీపడిన సంఘటన గుర్తొచ్చింది.

అప్పటిలో వాళ్ళ ఊరిలో బడిలేదు. ఐదు మైళ్ల దూరములో వున్న పట్నానికి నడిచి వెళ్ళి అక్కడ బడిలో చదువుకునే వాడు సుబ్బయ్య. గోనెతో తయారుచేసిన ఓ సంచీలో పుస్తకాలు పెట్టుకొని వెళ్ళేవాడు అతను. రంగు రంగుల సంచీలు చూసి మోజుపుట్టిన అతను తనకు కూడా మంచి సంచీ కావాలని పేచీ పెట్టేడు.

"చదువు కావాలంటే ఆ సంచీలో పుస్తకాలు వేసుకొని వెళ్ళమను" సుబ్బయ్యకి ఓ మంచి సంచీ కొనమని సిఫార్సు చేసిన అమ్మతో అన్నాడు నాన్న. "ఆ సంచీ తీసుకొని వెళ్ళటము నామోషీ అయితే పుస్తకాలు చేత్తో పట్టుకొని వెళ్ళమను, లేకపోతే చదువుమానివేయమను. పాతిక రూపాయల సంచీ కొనటానికి మనమేమన్నా జమిందారులమా?"

అమ్మ ఏమీ అనలేదు. పెరటిలోని తోటలో వికసించక ముందే రాలిపోయే మల్లె మొగ్గలను చూస్తూ చీర కొంగుతో కళ్ళు వత్తుకుంది.

పాతసంచీలో పుస్తకాలు సర్దుకొని మరునాడు బడికి బయలుదేరిన సుబ్బయ్యని అక్కున చేర్చుకుంది అతని తల్లి. "బాగా చదువుకోవాలి నాయనా, బాగా చదువుకొని మంచి ఉద్యోగం సంపాదిస్తే నీకు కావలసిన అన్నీ నీవే కొన్నుకోవచ్చు"

బాధగా నిట్టూర్చాడు సుబ్బయ్య. అతని నిట్టూర్పుకి ప్రతిధ్వనిలా వినిపించింది దూరం నించి బస్సు వస్తున్న శబ్దం.

మరొకసారి కండువాతో కళ్ళు వత్తుకొని లేచి నిలబడ్డాడు సుబ్బయ్య. కాళ్ళూ చేతులు వణికినట్లు తోచింది అతనికి. అప్పన్న అది గమనించినట్లున్నాడు. "ఎవరినైనా తోడు తీసికెళ్ళకూడదూ, గురువుగారు" అతనడిగేడు.

ఎవరినైనా తోడు తీసికొని వెళ్ళటం అవసరమని సుబ్బయ్యకు తెలుసు. కానీ, ఓ మనిషి పట్నం వెళ్ళి రావాలంటే పదిహేను రూపాయలు ఖర్చు. అసలే చేతిలో డబ్బులు తక్కువ.

బస్సు కదిలింది. రోడ్డు చూస్తూ యదాలాపంగా కూర్చున్నాడు. సుబ్బయ్య ఎదగటానికి ఆత్రుత, అర్హత వున్నా అనుకూలించని పరిస్థితుల వల్ల, కొమ్మలు నరకబడి, రోడ్డు వారన కనిపించే చెట్లు అతని జీవితానికి ప్రతీకల్లా తోచాయి సుబ్బయ్యకు.

ఆ రోడ్డు అతనికి కొత్తకాదు. ఆరు సంవత్సరములు ఆదారిలోనే నడిచి బడికి వెళ్ళేవాడు. అప్పటిలో ఆ రోడ్డు లేదు. బస్సు అసలే లేదు. కాళ దారిలాంటి ఆ బాటలో నడిచి, నడిచి వెళుతూ వుంటే కాళ్ళు నొప్పులు పుట్టి ఏడుపు వచ్చేది. సైకిలు మీద వెళ్ళే స్నేహితులను చూస్తే అసూయ, ఈర్ష్య, కలిగేది. తనకు కూడా ఓ సైకిలు కొనని నాన్న మీద కోపం వచ్చేది.

"నేను రేపటినుంచీ బడికి వెళ్లనమ్మా" ఆరోజు బడినుంచి రాగానే కోపంగా సంచీ ఓ మూలపారేసి అన్నాడు సుబ్బయ్య.

ప్రశ్నార్థకంగా చూసింది అతని తల్లి.

"రోజూ యింత దూరం నేను నడిచి వెళ్ళలేనమ్మా" మళ్లీ అన్నాడు సుబ్బయ్య.

“నడవలేక చదువు మాని వేస్తావా?” అమ్మ కోపంగా అడిగింది. “చదువుమాని వేసి ఏమిచేద్దామని?”

“ఏమో నాకు తెలియదు” ఓ నిముషము తరువాత అన్నాడు సుబ్బయ్య.

“నేను మాత్రం నడిచి వెళ్ళలేను సైకిలు కొని ఇస్తేనే బడికి వెళతాను అంతే.

“సైకిలా....!” ఆమె అలా వుండిపోయింది. “నువ్వేమైనా జమీందారు బిడ్డవని అనుకుంటున్నావా, సైకిలు మీద బడికి వెళ్ళటానికి?” ఆమె అడిగింది.

సుబ్బయ్య తలవంచుకున్నాడు.

“సైకిలు అంటే మాటలా, నాలుగు వందలు కావాలి. ఆ నాలుగు వందలే వుంటే....” ఆమె గొంతు జీరబోయింది. చీరకొంగుతో కళ్ళువత్తుకొని అంది. “ఆ నాలుగు వందలే వుంటే మీనాన్న పట్నం వెళ్ళి వైద్యము చేయించుకోలేరు? మొండి మనిషి గనుక అలా తిరుగుతున్నారు కానీ....”ఆమె మాటలు పూర్తి చెయ్యలేకపోయింది.

సుబ్బయ్యకు బాధ కలిగింది.

నిజమే ! ఓ సంవత్సర కాలమునుంచి నాన్నగారి ఆరోగ్యము అంతంత మాత్రముగానే వుంది. రాత్రంతా ఒకటేదగ్గు. జ్వరంకూడా వస్తోందట ! కాస్త పనిచేసేటప్పటికి అలసిపోతున్నారట ! ఆచారి గారు ఇస్తున్న నాటు మందు వాడుతున్నారు గానీ, ఏమీ ప్రయోజనము కనిపించటము లేదు. నాన్నగారి జబ్బు ఆచారిగారి మందుకి లొంగదని పట్నము వెళ్ళి వైద్యము చేయించుకోవాలని ఊరిలో కొందరు అమ్మకి చెబుతూనే వున్నారు. ఆ మధ్యన మామయ్య వచ్చినప్పుడు కూడా అదే మాట అన్నారు.

“నా మాట విని పట్నంరండి బావగారు, మంచి డాక్టరుకి చూపిద్దాము”

నాన్న ఏదో చెప్పబోయారు కానీ దగ్గు అతని మాటలని మింగేసింది. దగ్గి, దగ్గి కొంత కపం కక్కేసి అలసిపోయి గోడమీదకి వాలిపోయారు.

“అలా అయిపోయారేమిటి?” మామయ్య మళ్ళీ అన్నారు. “మీరు ఎందుకు వెనకాడుతున్నారో నాకు తెలుసు, బావ డబ్బు గురించే కదా? చూడండీ జబ్బు నయం

అయినంత వరకూ, మాయింట్లోనే వుండవచ్చుకదా? ఉన్నంతలో ఏ గంజో అందరూ కలసి తాగుదాము. ఇంకా డాక్టరు ఫీజుగురించి అంటావా..." చేతులు జోడిస్తూ అన్నాడు మామయ్య" ఓ అయిదువందలు రాయుడిగారిని అడిగితీసుకోండి"

రాయుడుగారి వద్ద పనిచేస్తూ వుండేవారు నాన్న.

"ఇంక డబ్బులు యివ్వనన్నారు రాయుడుగారు. ఇప్పటికే చలా బాకీపడ్డాను" నూతిలో నించి వచ్చినట్లు అనిపించాయి ఆ మాటలు.

సుబ్బయ్యకి ఏడుపు వచ్చింది. పరుగెత్తుకు వెళ్ళి అమ్మని వాటేసుకొని అన్నాడు. "ఒద్దమ్మా ఒద్దు, నాకు సైకిలు వద్దు, ఏమీ ఒద్దు. నేను చదువుకుంటాను. బాగా చదివి ఉద్యోగము సంపాదించి అన్నీ కొనుక్కుంటాను అమ్మా"

పరిస్థితులతో మరోసారి రాజీపడ్డాడు సుబ్బయ్య.

"దిగండి స్టేషన్ వచ్చేసింది" కండెక్టర్ కుదిపి లేపాడు సుబ్బయ్యని. బస్‌దిగుతూ వుంటే కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది, అతనికి. మెల్లగా రోడ్డుదాటి స్టేషన్‌వైపు నడిచాడు.

స్టేషన్ బాగా మారిపోయింది సుమారు నలుపతి ఐదు సంవత్సరాల క్రితము ఒకే ఒక్కసారి వచ్చాడు అతను స్టేషన్‌కి, పదోతరగతి పూర్తి చేసి కాలేజీలో చేరకముందు మాట అది, ఓ స్నేహితునికి వీడ్కోలు చెప్పటానికి వచ్చాడు అప్పుడు.

స్నేహితుని బండి ఎక్కించి స్టేషన్ బయటకు వచ్చేసరికే ఎర్రమబ్బుల నెత్తురు చుక్కలు కక్కి చనిపోయివున్నాడు, వెలుగునిచ్చిన సూర్యుడు మెలమెల్లగా అలుముకుంటున్న చీకటిలో నడచి యింటికి చేరాడు.

ఇంటినిండా జనాన్ని చూసి ఆశ్చర్యపోయాడు సుబ్బయ్య. ఓ వారగా నిలబడి మామయ్య ఎవరితోనో మాట్లాడుతున్నాడు. గబగబా లోపలికి నడిచేడు అతను. అక్కడ నేలమీద పడుకొని వున్నారు, నాన్నగారు తలవైపు నూనెదీపం వెలుగుతోంది.

షాక్ తగిలినట్లు అయింది అతనికి. లోనికి వచ్చినంత వేగంగా బయటకు పరుగెత్తాడు.

ప్రపంచమంతా చీకటి కమ్మివేస్తోంది. అప్పుడు గుర్తొచ్చింది, అతనికి వచ్చేవి కృష్ణపక్షపు రాత్రులని.

"ఇప్పుడు ఎలాగ అక్కా?" కర్మకాండ అంతః ముగించి పట్నానికి బయలు దేరుతూ అడిగాడు మామయ్య.

"ఎలాగేముందిరా," అమ్మ ఏడవలేదు నిర్వికారముగా అంది. "ఓ మనిషి పోయినంతమాత్రాన బ్రతుకు ఆగిపోతుందా? రాయుడుగారు కబురుపెట్టారు. సుబ్బయ్యని పనిలో చేరమంటున్నారు"

సుబ్బయ్యకి గుండెల్లోరాయి పడినట్లయింది అయితే యింక చదువు.....

"మరి వాడి చదువో?" మామయ్య కూడా అదేమాట అడిగేడు. "బాగా చదువుతున్నాడు కదక్కా"

"బాగా చదువుతున్నాడు. కానీ....................."

అమ్మ మామయ్యని సూటిగా చూడలేకపోయింది. బీటలు వేసి పెచ్చులు రాలిపోతున్న గోడమీద దృష్టినిలుపుతూ అంది "వాడిని బాగా చదివించాలనే అనుకున్నాను కానీ మన ఆలోచనలు కలసిరావద్దూ? రాయుడుగారికి ఆయన బాకీవున్నారు"

ఇంకా చదవాలని వుందనీ, రాయుడుగారి వద్ద పనిలో చేరటము యిష్టము లేదని గట్టిగా అరచిచెప్పాలనీ అనిపించింది సుబ్బయ్యకి కానీ నోటమాట రాలేదు.

"ఏడవకు బావా" ఓదార్చుతూ అంది సీత. సీత అతని మామయ్య కూతురు. "నేను బాగా చదివి నీకు చదువుచెపుతానులే"

"అయితే నీయిష్టం అక్కా" గేటుదాటుతూ అన్నాడు, మామయ్య మరోసారి పరిస్థితులతో రాజీ పడవలసి వచ్చింది సుబ్బయ్యకి.

క్యూ కదిలింది సుబ్బయ్యకన్నా ముందర వచ్చిన కొందరు టిక్కట్లు తీసుకొని వెళ్ళిపోయారు. సుబ్బయ్య వెనుక కొత్తతరం చేరింది.

గానుగ ఎద్దులా తిరిగేడు సుబ్బయ్య. ప్రకృతి మీద అలిగి వెళ్ళిన మల్లెలు, చేమంతులు అలుకతీరి వచ్చాయి. మళ్ళీ వెళ్ళాయి. నూనూగు మీసాలతో నిగనిగలాడిన సుబ్బయ్య దృఢకాయుడైనాడు. జుట్టు అక్కడక్కడ నెరిసింది.

ఒక చెల్లెలి పెళ్ళి చేసాడు అతను. చనిపోయిన తల్లి కర్మకాండ ఘనంగా జరిపించాడు.

అప్పుడప్పుడు వచ్చేవాడు అతని మేనమామ. మామయ్యతో పాటు సీత కూడా వచ్చేది. సీత చదువుపూర్తి చేసుకొని ఉద్యోగములో చేరింది.

"చిన్న తల్లికి పెళ్ళి అయిపోతే సీతనినీ చేతిలో పెట్టి ఏ కాశీకో వెళ్ళాలని వుందిరా" ఒకసారి మామయ్య అన్నాడు. కానీ సుబ్బయ్య ఎందుకో ఆమాటవిని ఆనందించలేక పోయాడు. సీత అంటే యిష్టంలేక పోవటము కాదు, దానికి కారణం. సీత బాగా చదువుకుంది. ఉద్యోగం కూడా చేస్తోంది కానీ తను......

"అలా బాధ పడకుబావా" ఆమాట అన్నప్పుడు సీత అంది "నువ్వు కూడా కొంత చదువుకోలేదా, ఏమిటి, పట్నము వచ్చేసెయ్యి, ఏదో ఒక ఉద్యోగము దొరక్కపోదు. అయినా నాకు కావాల్సినది నువ్వుకానీ, నీ చదువుకాదు కదా?"

మాటలకోసం వెతికేడు సుబ్బయ్య. కానీ దొరకలేదు. ఆకాశాన ఎగిరే తెల్లని కొంగలను చూస్తూ కూర్చున్నాడు.

ఎంత వెతికినా సంబంధము కుదరలేదు చిన్న తల్లికి, వెతకగా వెతకగా దొరికిన అతను సుబ్బయ్యని తన చెల్లెలిని పెళ్ళి చేసుకోమన్నాడు. కుండమార్పులు అన్నమాట !

ఆశనిపాతం తగిలినట్లు అయింది సుబ్బయ్యకి కుండ మార్పిడికి ఒప్పుకుంటే, సీత........

పోనీ వదిలేస్తే.....

చాలా కష్టము మీద వచ్చిందా సంబంధము పదిహేను వందల రూపాయల జీతగాడు దొరకటము సులభమా? సుబ్బయ్యకు ఏమీ చెయ్యాలో తోచలేదు.

పెళ్ళికి ఒప్పుకుంటే.....

నల్లగా, గున్న ఏనుగులాంటి ఆవిడతో జీవితాంతము గడపటము ఎలాగా ?

కుదరదని అనేస్తే.....

చిన్న తల్లి మొహము మనస్సులో కదిలింది.

జీవితములో మరోసారి పరిస్థితులతో రాజీపడ్డాడు సుబ్బయ్య.

చిన్న తల్లి పెళ్ళి జరిగిపోయింది.

సుబ్బయ్య పెళ్ళి అయ్యాక అతని యింటికి రాలేదు సీత. మామయ్య మాత్రము ఒకటి రెండుసార్లు వచ్చాడు. సుబ్బయ్య పెళ్ళి సీతని బాగా కృంగదీసిందని, అది పెళ్ళిచేసుకోనని మొండికేస్తోందని చెప్పాడు మామయ్య.

"నేను ఆండాలుని నచ్చే చేసుకున్నానా?" సుబ్బయ్య కళ్ళలో నీళ్ళు నిండాయి. "మనలాంటి మామూలు మనుషులకు యిష్టాయిష్టాలతో, పనిలేదు మామయ్యా. పరిస్థితులతో రాజీ పడిపోవాలి అంతే. రాజీ పడకపోతే మిగిలేది బాధే. జీవితము నాకు నేర్పిన పాఠము యిది ఒక్కటే" వేదాంతిలా అన్నాడు, సుబ్బయ్య.

'క్యూ' మళ్ళీకొంత కదిలింది.

టిక్కట్లుయిచ్చే చోటుకి దగ్గరగావున్న స్థంభములో అమర్చిన అద్దాలలో రోడ్డుకనిపించింది సుబ్బయ్యకి. పూర్తిగా నెరసిపోయిన కనురెప్పలలోని చెమటని తువ్వాలుతో అద్దుకొని, కళ్ళు చిట్లించి మళ్ళీ మళ్ళీ చూసాడు.

అవును ! రోడ్డుమీద స్కూటర్‌లో వెళ్ళేది అబ్బాయే !

అతని హృదయం చలించింది. రోడ్డుమీదకు పరుగెత్తుకెళ్ళి అబ్బాయిని ఆపాలని మనస్సు ఆతృత పడింది.

అంతలోనే గుర్తొచ్చింది, ఆండాళ్ళు హెచ్చరిక.

"ఏమండోయ్ పట్నం వెళుతున్నారు కదానని అంటున్నాను. అబ్బాయి యింటికి గానీ వెళ్ళకండి. తెలిసిపోయిందిగా వాడికి మన మీద ఉన్న ప్రేమ?"

"నేను మాత్రము ఎందుకువెళతానే" సుబ్బయ్య అన్నాడు "నాకు పౌరుషము లేదనుకున్నావా?"

అద్దంనుంచి దృష్టిమళ్ళించాడు సుబ్బయ్య.

అతనికి ఒక్కడే కొడుకు ఉన్నదానిలో అల్లారుముద్దుగా పెంచాడు. ప్రతీదానికీ పరిస్థితులతో రాజీపడి పోయిన తన బ్రతుకులా, కాకూడదు కొడుకు బ్రతుకని అనుకున్న సుబ్బయ్యవాడి కోరికలన్నీ ఎలాగోలా తీర్చేవాడు. బాగా చదివించాడు. వాళ్ళ కాళ్ళూ వీళ్ళ కాళ్ళూ పట్టుకొని ప్రభుత్వ ఉద్యోగములో చేర్చాడు.

ఉద్యోగములో చేరిన సంవత్సరానికే తనతో ఉద్యోగము చేసే అమ్మాయిని పెళ్ళిచేసుకుంటానన్నాడు, కాదనలేదు.

రోజూ ఉద్యోగానికి పట్నము వెళ్ళిరావటము కష్టముగా వుందని, పట్నంలో కాపురము పెడతానని అన్నాడు. అప్పుడూ కాదనలేదు.

పట్నములో స్థిరపడిపోయిన కొడుకు రాకపోకల తగ్గాయి, అయినా బాధపడలేదు.

అన్నిటికి రాజీపడి పోవటము అలవాటైపోయిన సుబ్బయ్యకి ఈ విషయాలేమీ కోపంగాని, బాధగాని కలిగించలేదు.

కానీ, మొన్న............

కాశీకి వెళ్ళేముందు కొడుకునీ, కోడలినీ చూడాలని పట్నము వెళ్ళారు సుబ్బయ్య దంపతులు. శేషజీవితాన్ని కాశీలోనే వెళ్ళబుచ్చాలని అనుకున్నారు కనుక రెండురోజులు వాళ్ళ దగ్గరవుండాలని కూడా అనుకున్నారు. సమయము చూసి కొడుకుని సహాయము కోరాలని కూడా అనుకున్నాడు, సుబ్బయ్య.

పట్నము చేరేటప్పటికే రాత్రి అయిపోయింది. కరెంటు కోతకి గురయిన కొడుకుయిల్లు సుబ్బయ్యకి ఏ వెలుగునీ అందించలేదు.

ఆరుబయట అనంతమైన ఆకాశాన్ని చూస్తూ పడుకున్నాడు సుబ్బయ్య

నిద్రపట్టలేదు. ఓ చిరునక్షత్రము కూడలేని ఆకాశము చిల్లర పైసలు కూడ లేని తనజేబులా తోచింది అతనికి.

"మామయ్యా వాళ్ళు కాశీకి వెళతారటండీ" లోపలిగదిలో నుంచి సన్నగా వినిపించింది కోడలిగొంతు.

"నాన్న చెప్పారు"

"డబ్బులడగటానికే వచ్చారేమోనండీ?"

"మన దగ్గర ఎక్కడున్నాయి డబ్బులు?"

"అలా అంటే బావుంటుందా అండీ మీనాన్నకదా?" కోడలిగొంతులో వ్యంగ్యం ధ్వనించింది. "ఏదో విధముగా మరికొంత అప్పుతీసుకురావద్దూ? లేకపోతే స్కూటర్ కొనటానికి రడీ చేసేరు కదా యిరువదివేలు. అందులో నుంచి యివ్వవద్దూ?"

"యిప్పుడు నా దగ్గర డబ్బులు లేవని చెప్తాను. స్కూటర్‌కోసం కష్టపడి డబ్బు చేర్చాను. స్కూటర్ కొంటాను. అది ఎవరికీ యిచ్చే ప్రసక్తి లేదు"

తన అవసరముతో రాజీ పడటము తన కొడుక్కు యిష్టములేదని సుబ్బయ్యకి తెలిసిపోయింది. మరునాడు ప్రొద్దున్నే వాళ్ళవూరు వెళ్ళిపోయారు.

సుబ్బయ్య మానసికంగా బాగా కృంగిపోయాడు. జీవితములో తన ఆఖరి కోరిక కూడా తీరదేమోనన్న భయం అతన్ని వెంటాడింది.

"ఎందుకండి అలాబాధ పడిపోతున్నారు. మనము కాశీకివెళ్ళాలి, అంతే కదా?" ఆండాళ్ళు అడిగింది.

"ఎలాగే వెళ్ళటము?" అతను దీనముగా అన్నాడు. "చిన్నరాయుడుగారు కూడా ఏమీ సర్దలేనని చెప్పేసారు"

"మనము కాశీకి వెళుతున్నాము" లోపలిగదిలో నించి వస్తూ అంది ఆండాళ్ళమ్మ

"ఇదిగో ఈ గొలుసు తీసుకోండి. ఇది అమ్మితే వచ్చే డబ్బు మనకు చాలండీ"

"ఆండాళ్లూ......"

సుబ్బయ్యకి కళ్ళనీళ్ళు నిండాయి. ఏమీ చెప్పాలో తోచలేదు.

"ముప్పది సంవత్సరాలుగా ఈ గొలుసుని జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నాను. ఈ రోజు దీని అవసరము వచ్చింది. అవసరానికే కదండి ఆభరణాలు"

టిక్కెట్లు తీసుకున్నాడు సుబ్బయ్య. ఆ టిక్కెట్లుని ఆనంధంతో మళ్ళీ మళ్ళీ చూసాడు. నిజమే! తను కాశీకి వెళుతున్నాడు. రెండడుగులు వెనక్కువేసి రోడ్డువైపు తిరిగాడు. కాళ్ళు నొప్పిగా ఉన్నాయి. అయినా గబాగబా నడిచేడు. వెంటనే యింటికి వెళ్ళాలి. అండాళ్ళుకి టిక్కెట్లు చూపించాలి.

రోడ్డుదాటి బస్‌స్టాప్ వైపు అడుగు వేసాడు.

నాలుక ఎండిపోతున్నట్లుగా అనిపించింది. రోడ్డుమీదుకి ఒరిగి పోయాడు అతను.

అప్పుడే ఎక్కడనుంచో వచ్చినగాలి అతనిచేతిలోని టిక్కెట్లుతోపాటు, అతని జీవాత్మని కూడా లాక్కుని వెళ్ళిపోయింది.

జీవితములోనే కాక మరణములో కూడా రాజీపడిపోయిన ఆ సగటు మనిషి గురించి ఎవరూ పట్టించుకోలేదు.

ఆ దృశ్యము చూడటము యిష్టములేని లోకబాంధువుడు తన కార్యలయ కిటికీలమీదగా మబ్బుపొరల యవనిక జరిపేసాడు.

(అన్వేషణ - వారపత్రిక 26-12-95)